వైభవంగా ఉజ్జయినీ మహంకాళి ఘటోత్సవం

- బోనాల ఉత్సవాలను ప్రారంభించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్
- అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన చేసిన పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి

బేగంపేట్ జూలై 7: ప్రతిష్టాత్మక సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆషాఢమాస బోనాల జాతర ఆదివారం ప్రారంభమైంది. మహంకాళి అమ్మవారి ఘటోత్సవాల్లో భాగంగా ఆదివారం దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారి ఘటత్సోవ అలంకరణను ప్రారంభించారు. పసుపు, కుంకుమ, అమ్మవారి ప్రతిమ, పట్టు వస్త్రాలను వేద మంత్రోచ్ఛరణలతో మంగళవాయిద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు అమ్మవారి ఘటానికి దారి పొడవునా ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో హైదరాబాద్ నగర


ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో అమ్మవారి స్వర్ణ పుష్పార్చన పూజలో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి

మహంకాళి ఆలయంలో ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ,పొన్నం ప్రభాకర్

పోతరాజు విన్యాసాలను తిలకిస్తున్న మంత్రి కొండా సురేఖ

నిర్వహించిన అనంతరం అమ్మవారి ప్రతిమ, పసుపు కుంకుమలను ఊరేగింపుగా కర్భలా మైదానానికి తీసుకెళ్లారు. అంతకుముందు పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహంకాళి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన గావించారు. ఆలయ మండపంలో గణపతి హోమం చేశారు. రాత్రి ఏడు గంటలకు కర్భలా మైదానంలో ముస్తాబైన అమ్మవారి ఘటం ఊరేగింపుగా తిరిగి మహంకాళి దేవాలయానికి తీసుకువచ్చినట్లు ఆలయ ఈవో గుత్తా మనోహరెడ్డి తెలిపారు. పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి సామగ్రిని కర్భలా మైదానానికి తరలించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మేయర్ గద్వాల విజయలక్ష్మీ, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాల సమర్పణ.. ఆకట్టుకున్న పోతరాజు విన్యాసాలు

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి ఆదివారం బోనాల సమర్పణ ప్రారంభమైంది. కటారి మహేశ్ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పోతరాజుల విన్యాసాలు, జోగినిలు తలపై బోనాలతో చేసిన నృత్యాలు భక్తులను ఆకర్షించింది. అంతకుముందు దేవాలయంలో ఫౌండర్ సభ్యులు సురిటి ఫ్యామిలీ సభ్యులైన సురిటి కామేశ్ నేతృత్వంలో అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం దేవాలయం ఎదుట సురిటి అప్పయ్య సేవా సమితి వలంటీర్లు సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అన్నదానం చేస్తుండగా చెదరగొట్టిన పోలీసులు..

మహంకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ(బీఆర్ఎస్) అన్నదానం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. మంత్రులు వస్తున్నారని దేవాలయ ప్రాంగణంలో ఇబ్బందులు కలిగించవద్దంటూ అన్నదాన కార్యక్రమాన్ని ఎత్తివేయించారు. దీంతో భక్తులంతా సగం భోజనం చేసి అసహనానికి గురయ్యారు. పోలీసుల తీరుపై భక్తులు మండిపడ్డారు.

మహంకాళి ఆలయంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్ పూజలు

బొల్లారం : ఏడో వార్డు లాల్‌బజార్ శ్రీ మహంకాళి ఆలయంలో ఆదివారం ఆషాఢ మాస మొదటి వారాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బొల్లారం : లాల్‌బజార్ అమ్మవారికి పూజలు చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న జోగినులు, ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

బోనాల జాతరను విజయవంతం చేస్తాం..

బేగంపేట్, జూలై 7: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరను వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని దక్కన్ మానవ సేవా సమితి సభ్యులు ప్రకటించారు. ఆదివారం దక్కన్ మానవ సేవా సమితి సభ్యులు దేవాలయ ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి బోనాలను విజయవంతం చేయాలని నిర్ణయించారు. జాతర అధ్యక్షుడిగా ధరంవీర్‌ఆర్య, కార్యనిర్వహక అధ్యక్ష కార్యదర్శులుగా కొంక రఘుమోహన్, సీకే నర్సింగరావు, ప్రధాన కార్యదర్శిగా దయానంద్ రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా అమ్మవారిని దర్శించుకునేందుకు, అన్నిశాఖల అధికారులను సమన్వం చేస్తూ చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌గౌడ్, శీలం సాయి, అనురాగ్, రవికాంత్, తారా చంద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

విశ్వమానవ సంక్షేమ సంఘం ప్రతినిధులు

అమీర్‌పేట్, జూలై 7 : విశ్వమానవ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం సనత్‌నగర్ జెక్‌కాలనీ గాంధీ పార్కులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 2024-26 కాలానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యవర్గ అధ్యక్షుడిగా ఎస్‌వై వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా బి.చంద్ర శేఖర్, ప్రధాన కార్యదర్శిగా టీఎస్‌పీ ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా డీఎస్ రావు, కోశాధికారిగా ఇబ్రహీం, కార్యవర్గ సభ్యులుగా భానో జీరావు, సుదర్శన్‌రావు, గౌరాధ్యక్షుడిగా అనంతరెడ్డి, డాక్టర్ మల్లు ప్రసాద్ నియమితులయ్యారు.

'డబుల్' స్థల దాతలకు చేయూత

- దుకాణాల నిర్వహణ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే తలసాని

బేగంపేట్ జూలై 7: డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి స్థలం కేటాయించిన భూ యజమానులకు దుకాణాలను కేటాయిస్తూ మంజూరైన పత్రాలను ఆదివారం వారికి మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో సరైన సౌకర్యాలు, వసతులు లేక ఇబ్బంది పడుతున్న పేదల కోసం ఎమ్మెల్యే తలసాని చొరవతో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపట్టారు. పూర్తి స్థాయిలో ఇండ్లు నిర్మించేందుకు స్థలాన్ని సేకరించారు. స్థలం అందించిన అంబేద్కర్‌నగర్‌కు చెందిన లక్ష్మీబాయి, శాంతబాయి, కృష్ణ యాదవ్, బాలేశ్‌యాదవ్‌కు పరిహారంగా డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో కేటాయించిన 8 దుకాణాలను కేటాయిస్తూ జీహెచ్ఎంసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయా పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు దుకాణ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బంజారాకాలనీలో వన మహోత్సవం

బొల్లారం, జూలై 7 : వనమహోత్సవం కార్యక్రమంలో ఏడో వార్డు తిరుమలగిరి బంజారాకాలనీలో కాలనీవాసులు పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ జీవీఎస్ మూర్తి, ప్రధాన కార్యదర్శి వైవీ రావు, తదితరులు పాల్గొన్నారు.

చలో హిమాయత్‌నగర్‌ను విజయవంతం చేయాలి

ఆటో యూనియన్ నాయకులతో సమావేశమైన మహ్మద్ ఉమర్‌ఖాన్

సికింద్రాబాద్, జూలై 7: ఆటో కార్మికులంతా చలో హిమాయత్‌నగర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఆటోడ్రైవర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ ఉమర్ ఖాన్ పిలుపునిచ్చారు. ఆదివారం సీతాఫల్‌మండి ఆటోస్టాండ్‌లో ఆయన ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. సోమవారం నిర్వహించే చలో హిమాయత్‌నగర్, ఏఐటీయూసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఆటో డ్రైవర్లంతా కలసి రావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ ఆటో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ షేక్ లతీఫుద్దీన్‌తోపాటు నాయకులు కృష్ణమూర్తి, షేక్ రషీద్, మహ్మద్ ఖాదర్, మహ్మద్ ఖాజా, మహ్మద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

సికింద్రాబాద్, జూలై 7: చిలకలగూడ కట్ట మైసమ్మ పోచమ్మ ఆలయంలో ఆదివారం బీజేపీ సికింద్రాబాద్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమీపిస్తున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన కృష్ణ, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులను దేవేందర యాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు, హక్కుదారులను సన్మానించారు. ఈనెల 28న జరిగే బోనాల జాతరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్ ఆలయ కమిటీని కోరారు. కార్యక్రమంలో పంపరి యాదగిరి, బట్టల శీను తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రెండో రోజు 'బస్తీబాట'

అడ్డగుట్టలో బస్తీబాట నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అడ్డగుట్ట, జూలై 7 : అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని బీ, సీ సెక్షన్లలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం రెండోరోజు బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జోనల్ కార్యదర్శి అజయ్‌బాబు మాట్లాడుతూ.. బస్తీల్లో కలుషిత నీటి సమస్యతో పాటు లోప్రెషర్‌తో నీరు సరఫరా కావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ప్రధాన, అంతర్గత రోడ్లన్నీ గుంతలమయంగా దర్శనమిస్తున్నాయని తెలిపారు. మజీద్ ఏరియాలో చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ నీరు ఉప్పొంగి ఇండ్లలోకి వస్తుందని పేర్కొన్నారు. అధికారులు దృష్టిసారించి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేశ్, ఫాతిమా, నర్సింగ్‌రావు, పాష, ఎండీ పాష, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలి

సికింద్రాబాద్, జూలై 7: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు నామ సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీస్ అధికారి జీవితానికే గ్యారంటీ లేకుంటే ఇక సామన్యుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెంటనే స్పందించి శ్రీనివాస్ కుటుంబసభ్యులకు న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా దోషులను విధుల నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

తమిళ నాడు బీఎస్‌పీ అధ్యక్షుడి హత్యను ఖండించాలి

ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులు

సికింద్రాబాద్, జూలై 7: బలహీన వర్గాల ముద్దుబిడ్డ తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ హత్యను పలువురు ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు ఖండించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో బహుజన స్టూడెంట్ జాక్ చైర్మన్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేల్పుల సంజయ్ మాట్లాడుతూ.. బహుజన నాయకుడి హత్యను దేశ వ్యాప్తంగా బహుజన సమాజం మొత్తం ఖండించాలని పిలుపునిచ్చారు. బలహీన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంతో పోరాడుతున్న ఆర్మ్ స్ట్రాంగ్‌ను హత్య చేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాలని, సీబీఐచే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కొమ్ము శేఖర్, అజయ్, ప్రవీణ్, రాజు, టీఎస్‌పీ చైర్మన్ చంద్ర శేఖర్, జంగిలి దర్శన్, నవీన్, భాస్కర్, యుగంధర్, ప్రవీణ్, హరీశ్, రవికుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల సంకల్ప బలం.. ఎమ్మార్పీఎస్ ఉద్యమం

- ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

పార్సిగుట్టలోని జాతీయ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, నాయకులు

ఆర్ట్స్ కళాశాల ఎదుట కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్,ఎంఎస్ఎఫ్ నాయకులు

సికింద్రాబాద్, జూలై 7: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం 30 ఏండ్లుగా నిలబడడానికి మాదిగల సంకల్ప బలం, సమాజ అండదండలే కారణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సికింద్రాబాద్ పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ పాల్గొని ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు, అనంతరం అధునీకరించిన ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. తన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు సమాజం మొత్తం ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలబడిందన్నారు. మాదిగల కోసమే కాకుండా అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం ఎమ్మార్పీఎస్‌ను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీతో పాటు అనేక సంక్షేమ పథకాలు సాధించినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశం ప్రస్తుతం అంతిమ దశలో ఉందని, మాదిగలు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముప్పై ఏండ్ల ఉద్యమం అన్ని వర్గాల ప్రజల సహకారంతోనే సాధ్యమైందని, సమాజానికి రుణపడి ఉన్నామని అన్నారు.

పాలకులు ఉద్యమాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నప్పటికీ మాదిగలు చెక్కు చెదరకుండా నిలబడ్డారని అన్నారు. భవిష్యత్‌లో ఎస్సీ వర్గీకరణ సాధనతోపాటు అణగారిన వర్గాల సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో ఉద్యమిస్తామని మంద కృష్ణ వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రావెల కిశోర్ బాబు, మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, ప్రముఖ బీసీ నేత కందుకూరు జగదీశ్వర్ రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ నాయకులు రాగటి సత్యం మాదిగ, లక్ష్మణ్ మాదిగ, సోమశేఖర్ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, డప్పు మల్లికార్జున్ మాదిగ, బస్తీవాసులు మల్లేశ్ మాదిగ, మల్లేశ్ గంగపుత్ర, బాచి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం, సమాజహితమే ఎమ్మార్పీఎస్ ఆశయం

సమాజ హితం కోసం సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయమని ఆ సంఘం తెలంగాణ అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఆదివారం ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు మంద రాజుమాదిగ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం గోవిందు నరేశ్ మాదిగ, సోమశేఖర్ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ మాట్లాడుతూ.. పాలకుల కుట్రలను ఛేదిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం 30 ఏండ్లుగా సజీవంగా నిలబడిందన్నారు. సమాజంలో నెలకొని ఉన్న సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలను రూపుమాపి సాంఘిక సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పల్లెర్ల సుధాకర్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ, శివకుమార్ మాదిగ, నరసింహా, సంజయ్, జంగిలి దర్శన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బోయిగూడలో..

బన్సీలాల్‌పేట్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం న్యూబోయిగూడలోని గొల్ల కొమరయ్య కాలనీలో ఆ సంఘం నాయకుడు ఎఎస్ నారాయణ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదినం పురస్కరించుకుని రాజేందర్, నర్సింగ్‌రావు కేక్‌ను కట్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కోడూరు కుమార్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నరేందర్, గోపి, శంకర్, మల్లేశ్, జగన్, నర్సింగ్, అభిలాశ్, బీజేపీ నాయకులు మహేశ్, బీఆర్ఎస్ నాయకుడు రాజేందర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

తుకారాంగేట్ సీఐగా మాలోత్ శంకర్

అడ్డగుట్ట, జూలై 7 : తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మాలోత్ శంకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన అంజనేయులు సీసీఎస్‌కు బదిలీపై వెళ్లగా కమాండో కంట్రోల్ సెంటర్ నుంచి మాలోత్ శంకర్ తుకారాంగేట్‌కు వచ్చారు. 2009 బ్యాచ్‌కు చెందిన శంకర్ హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ.. శాంతిభద్రల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

వర్గీకరణకు కేంద్రం కట్టుబడి ఉండాలి

కుత్బుల్లాపూర్, జూలై 7 : మాదిగల వర్గీకరణపై ఎన్నికల ముందు ప్రధాని మోదీ ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణ బిల్లును రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి అమలు చేయాలని మాదిగ జర్నలిస్టు ఫోరం జాతీయ నాయకులు ముక్కెర్ల లాలయ్య, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏండ్లు కావడంతో కుత్బుల్లాపూర్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ప్రతినిధులు ఆయా డివిజన్లు, ప్రధాన చౌరస్తాలో సంఘం జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిజాంపేట్‌లోని సాయినగర్‌లో జరిగిన జెండావిష్కరణ కార్యక్రమం లో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్ష,ఉపాధ్యక్షులు మల్లికార్జున్, శ్రీను, బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

యశస్వి స్కాలర్‌షిప్ విధానాన్ని స్వాగతిస్తున్నాం..

- ఏబీవీపీ రాష్ట్ర సావిష్కార్ కన్వీనర్ తోట శ్రీనివాస్

సికింద్రాబాద్, జూలై 7: ఏఐసీటీఈ ప్రతిపాదించిన యశస్వి స్కాలర్‌షిప్ విధానాన్ని స్వాగతిస్తున్నామని ఏబీవీపీ రాష్ట్ర సావిష్కార్ కన్వీనర్, టెక్నికల్ సెల్ ఇంజినీరింగ్ పరిశోధక విద్యార్థి నాయకుడు తోట శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన ఓయూలో విలేకరులతో మాట్లాడారు. గత కొంతకాలంగా ఇంజినీరింగ్ విద్య అంటే కేవలం సీఎస్సీ, అనుబంధ బ్రాంచీలు అనే విధంగా విద్యార్థులు అధిక సంఖ్యలో చేరేవారన్నారు. కోర్ బ్రాంచీలుగా పిలవబడే ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లలో విద్యార్థుల చేరిక పూర్తిగా తగ్గుముఖం పట్టిందని, దాంతో అన్ని ఇంజినీరింగ్ కాలేజీలు సీఎస్సీ, అనుబంధ బ్రాంచీల సీట్లను పెంచుకున్నట్లు చెప్పారు.

ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీల్లో కోర్ బ్రాంచుల ఇంజినీర్ల పాత్ర చాలా పెద్దదిగా ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఏఐసీటీఈ 'యంగ్ ఎచీవర్స్ స్కాలర్‌షిప్ అండ్ హోలీస్టిక్ అకడమిక్ స్కిల్స్ వెంచర్ ఇనిషియేటివ్'(యశస్వి) పేరుతో 2024-25 సంవత్సరం కోర్ బ్రాంచ్‌ల్లో చేరే విద్యార్థులకు వారి ఇంటర్ మార్కుల ఆధారంగా ఇంజినీరింగ్‌లో చేరిన 5 వేలు, డిప్లొమాలో చేరిన 5 వేల మంది విద్యార్థులకు రూ. 18,000, 12,000 చొప్పున స్కాలర్‌షిప్ అందజేసే కార్యక్రమానికి పూనుకుందని చెప్పారు. ఏఐసీటీఈ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఏబీవీపీ స్వాగతిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బ్రాంచ్‌లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను రూ. 35 వేల కంటే ఎక్కువ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారం, జూలై 7: కంటోన్మెంట్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే ఒకటో వార్డు పరిధిలోని చిన్నతోకట్ట, సంజీవయ్యనగర్ బస్తీలో పర్యటించి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు కమ్యూనిటీ హాల్, డ్రైనేజీ, రోడ్లు, నీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.సానూకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలను తీసుకుంటానని తెలిపారు. కమ్యూనిటీ హాల్‌లో వంటగది, అన్ని రకాల వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ఆనంద్‌బాబు, శ్రీనివాస్, మధుకర్, బల్వంత్‌రెడ్డి, హరికృష్ణ, మారుతి, వర్ణరాణి, వందన తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి సంజీవయ్య నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారంలో..

బొల్లారం తోటి, మేదర సంఘం కమ్యూనిటీ వాసులతో ఆదివారం ఎమ్మెల్యే శ్రీగణేశ్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా కమ్యూనిటీ హల్ నిర్మాణంతోపాటు కాంపౌండ్ వాల్ నిర్మిస్తామని,బొల్లారం కంటోన్మెంట్ దవాఖానలో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అమర్‌రాజ్, జనరల్ సెక్రటరీ రవి ప్రసాద్, మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాశ్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నరసింహన్, బాల్‌రాజు, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

మారేడ్‌పల్లి : కంటోన్మెంట్ ఐదో వార్డు కాకాగూడలోని శ్రీసాయి అపార్టుమెంట్, శాంతి దీప్తి కాలనీల్లో తాగునీటి సదుపాయం కల్పించాలని ఆదివారం కాలనీవాసులు ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కాకాగూడలో ఇప్పటివరకు తాగునీటి కనెక్షన్స్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, 31 ప్లాట్స్ అపార్టుమెంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి నల్లా కనెక్షన్ కల్పించాలని ఆదేశించారు.

ఘనంగా దుర్గమ్మ బోనాలు

మేడ్చల్, జూలై 7 : మేడ్చల్ పట్టణంలోని కుమ్మరి బస్తీలో కొలువైన దుర్గమ్మ తల్లి బోనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బస్తీకి చెందిన మహిళల